నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 11 జనవరి 2024 | SURYAPET

నెల రోజుల్లో

పంట పెట్టుబడి సాయంలో తీవ్ర జాప్యం

11.83 శాతమే

ఇప్పటి వరకు రైతులకు అందింది రూ. 147.38 కోట్లు మాత్రమే

11.06లక్షల మందికి గానూ 4.06 లక్షల మందికే లబ్ధి

ఎదురు చూపుల్లో 7లక్షల మంది రైతులు

ప్రభుత్వ తీరుపై రైతుల్లో అసహనం

నల్లగొండ ప్రతినిధి, జనవరి10 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలకు అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ సర్కార్ చేతలకు పొంతన లేకుండా పోయింది. రైతుబంధు స్థానంలో రైతు భరోసా పేరుతో ఎకరాకు పెట్టుబడి సాయంగా రూ.7500 అందిస్తామని చెప్పి... తీరా అధికారంలోకి రాగానే ఈ సారికి గతంలో మాదిరిగానే రూ.5వేలతోనే సరిపెట్టుకోవాలని ప్రకటించింది. కొత్త సర్కార్ కదా అని రైతులు సరేలే అనుకున్నా... ఆ డబ్బుకు కూడా భరోసా లేకుండా పోయింది. నెల రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లా పరిధిలో కేవలం రూ.147.38 కోట్లు మాత్రమే రైతుల ఖాతాలకు చేరింది. మొత్తం నగదులో ఇది 11.83శాతమే కావడం గమనార్హం. 11.06లక్షల మంది రైతులు ఉండగా నేటికీ 4.06లక్షల మందికే రైతు భరోసా డబ్బులు జమైనట్లు ప్రభుత్వ లెక్కలు వెల్లడిస్తున్నాయి. మిగతా ఏడు లక్షల మందికి నిత్యం ఎదురు చూపులు తప్పడం లేదు. యాసంగి సీజన్ ముగింపు దశకు వచ్చినా పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలకు ముందుగానే యాసంగి రైతుబంధు డబ్బులను రైతులకు అందించాలని అప్పటి కేసీఆర్ సర్కార్ రంగం సిద్ధం చేస్తే కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్న విషయం తెలిసిందే. పైగా తాము అధికారంలోకి వచ్చిన మర్నాడే ఎకరాకు 7,500 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామంటూ రైతులను మభ్యపెట్టింది. అధికారంలోకైతే వచ్చింది... కానీ రైతు భరోసా మాత్రం పెంచలేదు. కేసీఆర్ సర్కార్ మాదిరిగానే ఈ సీజన్ వరకు 5వేల రూపాయలే ఇస్తామని ప్రకటించి గత నెల 10 నుంచి జమ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడడం లేదు. వాస్తవంగా రోజుకో ఎకరం చొప్పున పెంచుతూ పక్షం రోజుల్లోనే గత కేసీఆర్ సర్కార్ రైతుబంధు నగదు జమలు పూర్తి చేసేది. కానీ బుధవారం నాటికి 30 రోజులు పూర్తైనా నేటికీ జమ చేయాల్సిన మొత్తం నగదులో కేవలం 11.83శాతమే రైతుల ఖాతాల్లో పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11.06లక్షల మంది రైతులకుగానూ రూ.1245 కోట్లు పెట్టుబడి సాయంగా అందాల్సి ఉంది. ఇందులో నెలరోజుల్లో కేవలం 4.06లక్షల మంది రైతులకు గానూ రూ.147.38కోట్లు మాత్రమే ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 88.17శాతం నగదు జమ చేసే సరికి సీజన్ పూర్తై వానకాలం కూడా వస్తుందే మోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎదురు చూపుల్లో 7లక్షల మంది

సరిగ్గా నెల రోజుల కిందట పెట్టుబడిసాయం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించినా తీవ్ర జాప్యం జరుగుతున్నది. నిత్యం రైతులకు తమ మొబైల్స్‌లో మెసేజ్ కోసం చెక్ చేసుకోవడం లేదా నేరుగా బ్యాంకు ఖాతాలో బ్యాలెన్స్‌ను సరిచూసుకోవడమే సరిపోతుంది. కానీ ఎంతకూ రైతుభరోసా నగదు మాత్రం జమ కావడం లేదు. ఇలా నెల రోజులుగా రైతులు సతమతం అవుతున్నారు. ఆగిఆగి సాగుతున్న తీరుగా నేటికీ కేవలం 4.06లక్షల మంది రైతుల ఖాతాల్లో 147.38 కోట్లే జమ అయ్యాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే నల్లగొండ జిల్లాలో మొత్తం రైతులు 5.42లక్షల మంది కాగా 2.02లక్షల మంది ఖాతాల్లో రూ.624కోట్లకుగానూ రూ.77.47కోట్లు జమ అయ్యాయి. సూర్యాపేట జిల్లాలో మొత్తం 2.93లక్షల మంది రైతులకు గానూ 1.15లక్షల మంది ఖాతాల్లో రూ.317కోట్లకు రూ.44.06కోట్లు పడ్డాయి. ఇక యాదాద్రి జిల్లాలో మొత్తం 2.71 మంది రైతులకు గానూ 89వేల మంది రైతుల ఖాతాల్లో రూ.304 కోట్లకు 25.85కోట్ల నగదే జమ జరిగింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇంకా 7లక్షల మంది రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. వీరికి గానూ మొత్తం రూ.1198కోట్ల పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. నెల రోజుల్లో కేవలం 11.83శాతం నగదే రైతులకు చేరితే మిగతా 88.17శాతం ఎప్పుడు రైతుల ఖాతాల్లో జమ అవుతుందనేది సందేహాస్పదంగా మారింది. దీనిపై వ్యవసాయ అధికారుల వద్ద సైతం సరైన సమాధానం లేదు.

జిల్లా	మొత్తం రైతులు	అందాల్సిన నగదు	అందిన రైతులు	అందిన నగదు
నల్లగొండ	5.42లక్షలు	624 కోట్లు	2.02లక్షలు	77.47కోట్లు
సూర్యాపేట	2.93లక్షలు	317 కోట్లు	1.15లక్షలు	44.06కోట్లు
యాదాద్రి	2.71లక్షలు	304 కోట్లు	0.89లక్షలు	25.85కోట్లు
మొత్తం	11.06లక్షలు	1245 కోట్లు	4.06లక్షలు	147.38కోట్లు

నాడు ఎన్నడూ ఆగని సాయం...

కేసీఆర్ సర్కార్ హయాంలో 11 విడుతల్లో ఉమ్మడి జిల్లా రైతులకు రూ.11,700 కోట్ల రూపాయలు పెట్టుబడి సాయంగా అందింది. 2018 వానకాలం సీజన్ నుంచి రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టిన కేసీఆర్.. వరుసగా మొత్తం 11 సీజన్లల్లో క్రమం తప్పకుండా కచ్చితంగా అందజేస్తూ వచ్చారు. 2018 వానకాలం సీజన్ నుంచి ఎకరానికి నాలుగు వేల చొప్పున ఏడాదికి రెండుసార్లు పెట్టుబడి సాయం అందించడం మొదలు పెట్టారు. 2018 డిసెంబర్‌లో రెండోసారి అధికారంలోకి రాగానే వానకాలం నుంచి ఎకరానికి ఐదు వేల చొప్పున ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి 10వేల రూపాయల సాయాన్ని అందిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి గత వానకాలం సీజన్ వరకు ఎన్నడూ రైతుబంధు ఆగలేదు. పైగా సీజన్ సీజన్‌కు కొత్తగా పాసు పుస్తకాలు పొందిన ప్రతి రైతుకు సైతం పెట్టుబడి సాయం అందజేస్తూ వచ్చారు. ఒక్కసారి పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లోకి జమ కావడం మొదలైతే... చివరి రైతుకు అందే వరకు ఆగేది కాదూ. పక్షం రోజుల్లోనే పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రైతుబంధు పెట్టుబడి సాయం అందించిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే.

అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్నం

గత ప్రభుత్వ హయాంలో సమయానికి రైతు బంధు డబ్బులు పడడంతో వ్యవసాయ పెట్టుబడికి అప్పులు తెచ్చే అవసరం రాలేదు. ఈ సారి నాట్లు వేసి నెల రోజులైనా రైతు బంధు డబ్బులు పడలేదు. వాటి కోసం ఎదురు చూసి మందులకు, కూలీలకు అప్పులు తెచ్చినం. ఇంతకుముందు అప్పులు లేకుండా వ్యవసాయం చేయడంతో కొద్దో గొప్పో మిగిలేది. ఈ సారి పండించిన పంట అప్పులకే సరిపోయేటట్లున్నది.

– దేవిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్న మాదారం, కనగల్ మండలం

గతంలో వరి నాట్లకంటే ముందే రైతుబంధు పడేది

నాకు రెండు ఎకరాల భూమి ఉన్నది. రైతు బంధు డబ్బులు ఇంకా పడలేదు. గతంలో వరి నాట్లకంటే ముందే బ్యాంకు ఖాతాలో పడేవి. నాట్లు వేసి నెల గడుస్తున్నా ఎదురు చూడడమే మిగిలింది. రైతు బంధు డబ్బులతో ఎరువులు, విత్తనాలు, కొంత కూలీలకు వాడుకునే వాడిని. ప్రస్తుతం డబ్బులు పడక పోవడంతో అప్పు తీసుకొచ్చిన. గతంలోనే రైతులకు బాగుంది.

– మునుగోటి బాలయ్య, రైతు, ఆరెగూడం, తిప్పర్తి మండలం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

స్త్రీనిధి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ, జనవరి 10 : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి లాంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి లక్ష్యం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తున్న ఆయా కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని మండలాల్లో అభివృద్ధి పనులు వెనుకబడి ఉన్నాయని, అందుకు గల కారణాలను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాంపల్లి మండలంలో సరాసరి కూలీలకు అతి తక్కువ వేతనానికి గల కారణాలు తెలుసుకొని పనులు గుర్తించి కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఏపీడీని ఆదేశించారు. మిర్యాలగూడ మండలంలో సరాసరి లేబర్ టర్నౌట్ తక్కువగా ఉందని, దాన్ని మెరుగు పర్చాలని కోరారు. మొబైల్ ద్వారా హాజరు శాతం, దాని ఫలితాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, అవసరమైతే మేట్స్‌లలో చదువుకున్న వారు మొబైల్ వాడకంలో పరిజ్ఞానం ఉన్న వారి చేత మొబైల్ యాప్‌లో హాజరు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, సంపద వనాలు, సీఎం గిరి వికాసం, బడ్జెట్‌తో పాటు బ్యాంకు లింకేజీ వివరాలు, శిక్షణ కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంత ప్రజలు బాగుపడేలా జీవనోపాధులు కల్పించాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీఆర్‌డీఓ కాళిందిని, ఏపీడీలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

జి.తిరుమలగిరిలోని ఆయిల్ పామ్ తోటలో అంతర పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

ఆయిల్ పామ్‌లో అంతర పంటలతో అధిక లాభం

- కలెక్టర్ ఎస్ వెంకట్రావు

చివ్వెంల, జనవరి 10 : ఆయిల్ పామ్‌లో అంతర పంటల సాగుతో అధిక లాభం పొందుతున్నారని సూర్యాపేట కలెక్టర్ ఎస్ వెంకట్రావు అన్నారు. చివ్వెంల మండల పరిధి గుంపుల తిరుమలగిరిలో బుధవారం ఆయన ఆయిల్ పామ్ తోటలను పరిశీలించి మాట్లాడారు. పామాయిల్ సాగుతో పాటుగా అంతర పంటల ద్వారా మంచి ఆదాయం లభిస్తుందన్నారు. పామాయిల్ పంట నాలుగో సంవత్సరంలో పంట దిగుబడి వస్తుందని, 30 సంవత్సరాలు ప్రతి నెలా స్థిరమైన ఆదాయం వస్తుందని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో పతంజలి ద్వారా పామాయిల్ మొక్కల పంపిణీ జరుగుతుందని చెప్పారు. పామాయిల్ తోటలో మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటలుగా మిర్చి, వేరుశనగ, కంది, అరటి, బొప్పాయి, కూరగాయలు వంటి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్ పామ్ తోటల పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం కూడా చేపట్టవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా 5 ఎకరాల్లో పామాయిల్‌తోపాటు అంతర పంటగా మిర్చి, కంది సాగు చేసిన ప్రభాకర్‌రెడ్డిని కలెక్టర్ అభినందించారు. ఆయన వెంట జిల్లా ఉద్యాన వన పట్టు పరిశ్రమల అధికారి శ్రీధర్, పతంజలి పామాయిల్ డీజీఎం యాదగిరి, సూర్యాపేట ఉద్యానవన అధికారి జగన్, పతంజలి సిబ్బంది హరీశ్, సుధాకర్, రైతులు రాఘవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

12న జిల్లా స్థాయి క్రీడా పోటీలు

నల్లగొండ రూరల్, జవనరి 10 : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా, యువజన క్రీడల అధికారి మగ్బూల్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైక్వాండో 14, 17 సంవత్సరంలోపు క్రీడాకారులకు.. బ్యాడ్మింటన్ 15, 19, 25 సంవత్సరంలోపు క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఈ నెల 12న ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని తెలిపారు.

విప్ ఉల్లంఘించిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి వినతి

నీలగిరి, జనవరి 10 : నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌పై సోమవారం జరిగిన అవిశ్వాస తీర్మానంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు విప్ జారీ చేసినప్పటికీ దానికి విరుద్ధంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నల్లగొండ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి బుధవారం కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అమెను కలిసిన ఆయన జిల్లాకు నూతనంగా వచ్చినందుకు మర్యాద పూర్వకంగా పూల మొక్కను అందజేశారు. అనంతరం విప్ ధిక్కరించిన కౌన్సిలర్లను అనర్హులుగా ప్రకటించాలని కోరారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి సొంత పార్టీ చైర్మన్‌పై జరిగిన అవిశ్వాస ఎన్నికల్లో డబ్బుకు అమ్ముడుపోయి పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. అందుకు సంబంధించిన అన్ని వివరాలను ఆయన కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణ చేసి ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం అందజేస్తున్న తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి

నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

ఎల్ ఐసీ ఉద్యోగుల ఆందోళన

నల్లగొండ రూరల్, జనవరి 10: ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలోని ఎల్ఐసీ బ్రాంచ్– 1 ఆఫీస్ వద్ద క్లాస్ వన్ ఆఫీసర్స్ బుధవారం గంట సేపు సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎల్ఐసీ ఉద్యోగులకు 2022 ఆగస్టు ఒకటో తేదీ నుంచి నుంచి వేతన ఒప్పందం బకాయి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రతి ఏడాది రిటైర్మెంట్లు పెరుగుతున్నప్పటికీ కొత్త రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లాస్ వన్ ఆఫీసర్స్, డెవలప్ మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు గురుమూర్తి, నవీన్ దాసు, కృష్ణయ్య, వెంకట్, రెడ్డి పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు అడుగులు

మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు టెన్త్ ఎగ్జామ్స్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 226 పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- హాజరుకానున్న 40,372 మంది విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలకు అభ్యసన దీపికలు అందజేసిన విద్యాశాఖ

నేరేడుచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

రామగిరి, జనవరి 10 : పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఎగ్జామ్స్ నిర్వహించేందుకు ఇప్పటికే విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. కొన్ని స్కూళ్లు ఇప్పటికే సిలబస్‌ను పూర్తి చేయగా మరికొన్ని చివరి దశలో ఉన్నాయి. ఉత్తమ ఫలితాల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డీసీఈబీ ఆధ్వర్యంలో నిపుణులతో తయారు చేసిన అభ్యసన దీపికలను అందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది పరీక్షలకు 40,372 మంది విద్యార్థులు హాజరవుతుండగా 226 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి విద్యాశాఖకు పంపించారు. ఆమోదం రాగానే పరీక్షల నిర్వహణకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలతోపాటు సర్వం సిద్ధం చేయనున్నారు.

ఇప్పటికే ఫీజు చెల్లింపు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది పరీక్షలకు 40,372 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో నల్లగొండ జిల్లాలో 19,299 మంది, సూర్యాపేట జిల్లాలో 11,944, యాదాద్రి భువనగిరి జిల్లాలో 9,129 మంది ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 459, సూర్యాపేట జిల్లాలో 344, యాదాద్రి భువనగిరి జిల్లాలో 294 పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటికే విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజులు చెల్లించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నల్లగొండ జిల్లాలో 110, సూర్యాపేటలో 67, యాదాద్రిలో 49 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు అభ్యసన కరదీపికలు

విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖ డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామ్ బోర్డు(డీసీఈబీ) ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులతో కలిసి అభ్యసన కరదీపికలు తయారు చేసి ముద్రించింది. ఇప్పటికే వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. వీటితోపాటు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేస్తున్నారు. ఈ పర్యాయం ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రంలో మెరుగైన స్థానం దక్కేలా కృషి చేస్తున్నారు.

పరీక్ష కాలం.. కాలక్షేపం వద్దు

పదో తరగతి విద్యార్థులకు అత్యంత కీలకమైన సమయం ఇది. ప్రణాళిక ప్రకారం చదువాలని, ఒత్తిడికి గురికాకుండా ముందడుగు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. సమయ పాలన ముఖ్యమని, కాలక్షేపానికి తావివ్వకూడని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలతో గడుపడం, కబుర్లు, షికార్లు, బైక్ రైడింగ్‌లు, సినిమాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. తల్లిదండ్రులు కూడా ఇంట్లో చదువుకునే వాతావరణం కల్పించాలని సూచిస్తున్నారు. రాత్రి సమయంలో బలవంతంగా చదువడం వల్ల మెదడుకు చేరకపోగా అనారోగ్యానికి దారితీస్తుందని, అందుకే రాత్రి 11గంటల తరువాత చదువడం మంచిది కాదని చెబుతున్నారు. ప్రణాళికాయుతంగా చదివితే పరీక్షల్లో విజయం సాధించడం సులభమవుతుందని అంటున్నారు.

ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి

పదో తరగతి చదివే విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలి. విద్యార్థులకు విద్యాశాఖ అందజేసిన అభ్యసన కరదీపికలలోని అంశాలను బోధించాలి. విద్యార్థులకు పరీక్షలంటే భయం లేకుండా చేసి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

– బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

దళిత చైర్‌పర్సన్ స్థానంలో అవకాశం ఎవరికో..!

సూర్యాపేటలో అవిశ్వాసానికి తెరలేపిన అధికార కాంగ్రెస్

- మద్దతిస్తున్న బీజేపీ
- చైర్మన్, వైస్ చైర్మన్ మార్పు కోసం కలెక్టర్‌కు లేఖ ఇచ్చిన కౌన్సిలర్లు
- నేడు కాంగ్రెస్, బీజేపీ నాయకుల సమావేశం..?

సూర్యాపేట, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్, బీజేపీతోపాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు జతకట్టారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూర్యాపేట జనరల్ స్థానంలో దళిత మహిళ అయిన పెరుమాళ్ల అన్నపూర్ణకు చైర్‌పర్సన్ పదవికి అవకాశం కల్పించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పుట్ట కిశోర్‌ను వైస్ చైర్మన్‌గా అందరి మద్దతుతో ఎంపిక చేసి సీట్లో కూర్చోబెట్టారు. బీజేపీ, కాంగ్రెస్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను దించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా మళ్లీ చైర్మన్ పదవిని దళితులు, వైస్ చైర్మన్‌ను తెలంగాణ ఉద్యమకారులకు అవకాశం కల్పిస్తారా లేక మరెవరికైనా ఇస్తారా అనేది తేలాల్సి ఉంది. జనవరి 26, 2024 నాటికి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిల్ పదవి కాలం నాలుగు సంవత్సరాలు పూర్తయ్యింది. జనవరి 2025 నాటికి వీరి పదవీ కాలం ఉన్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి ఇతర పార్టీలు తోడై మద్దతు ఇచ్చి మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలకు చెందిన చైర్మన్లు, ఎంపీపీలపై అవిశ్వాసం పెట్టి దింపేస్తున్నారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసం సూర్యాపేట మున్సిపాలిటీకి చేరుకుంది. కాంగ్రెస్, బీజేపీతోపాటు బీఆర్ఎస్‌కు చెందిన పలువురిని జంట కలుపుకొని చైర్మన్, వైస్ చైర్మన్‌ను దింపేందుకు అవిశ్వాసం కోసం బుధవారం బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన 32 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన లేఖతో పాటు నోటీసును జిల్లా కలెక్టర్‌కు అందించారు. అవిశ్వాసం సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై చర్చించేందుకు గురువారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలోని రెండు గ్రూపులు సమావేశం కానున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరి అవిశ్వాసం పెట్టి నెగ్గేందుకు సరిపడా బలం ఉన్నట్లు కలెక్టర్‌కు ఇచ్చిన లేఖ తెలియజేస్తుండగా ఆ రెండు పదవులకు ఎవరిని ఎంపిక చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

అవిశ్వాస తీర్మానం కోసం కలెక్టర్‌కు లేఖ ఇచ్చేందుకు వెళ్తున్న పలువురు కౌన్సిలర్లు

మరిన్ని జిల్లా వార్తలు 6వ పేజీలో